ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 24 జనవరి 2025



మళ్లీ తెరపైకి డిటెన్షన్..?!



- విద్యార్థులు పాసైతేనే పైచదువులకు
- ఇకపై 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం
- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టానికి సవరణ

6

- ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు

ఎస్పీకి సమస్యల సవాల్



- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి వినియోగం
- పెరిగిన భూకబ్జాలు
- బార్లను తలపిస్తున్న బ్రాందీషాపులు
- కీలక కేసుల విచారణ నత్తనడక
- ఖాకీల్లో లోపించిన పోలీసింగ్
- నేడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న ఈజీ అశోక్‌కుమార్

(కడప-ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రెండున్నర నెలల తర్వాత రెగ్యులర్ ఎస్పీ శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రతిపక్ష నేత, మాజీ సీఎం జగన్ సొంత జిల్లా ఇది. ఇక కూటమి ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యేలు ఐదుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కీలకమైన జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉంచాల్సి ఉంది. ఎస్పీగా వస్తున్న ఈజీ అశోక్‌కుమార్ కడప డీఎస్పీగా సుమారు మూడేళ్లపాటు గతంలో పనిచేశారు. జిల్లాపై అవగాహన ఉన్నా.. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు మారాయి. ఇప్పుడు పోలీసుల్లో కూడా అప్పటి కరుకుదనం, చురుకుదనం లేదనే విమర్శ ఉంది. కేసుల విచారణ కూడా అంతంత మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో పోలీసుల్లో గాడి తప్పిన వారిని గాడిలో పెట్టి పోలీసింగ్‌లో చురుకుదనం తెప్పించాల్సి ఉంది. అలాగే యువతను నాశనం చేస్తున్న గంజాయిని నిర్మూలించడం ఇప్పుడు ప్రధాన సవాల్‌గా మారింది. ఇక భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. వీటన్నింటినీ కట్టడి చేయాల్సి ఉంది.

గంజాయి జోరు



ఒకప్పుడు ఉత్తరాంధ్రలోనే గంజాయి దొరికేది. ఇక్కడ సాధువులు మాత్రమే గంజాయి సేవిస్తూ కనిపించేవారు. ఇప్పుడది సిగరెట్లు, బీడీల మాదిరిగా ప్రతి చోటా దొరుకుతోంది. దీనికి యువత బాగా అలవాటుపడిపోయారు. ఉన్నత విద్యావంతులు కూడా దీనికి అలవాటు పడ్డారు. నీళ్ల లేని ఊరుందేమో కానీ గంజాయి దొరకని ప్రదేశమైతే లేదన్న స్థాయికి వచ్చిందంటే దాని వినియోగం ఎంత ఉందో అర్థమవుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హయాంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కడపలో డ్రోన్ల ద్వారా పాడుబడ్డ ప్రాంతాలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో నిఘా పెట్టి గంజాయి ముఠాలపై చర్యలు తీసుకున్నారు. ఆయన బదిలీ తర్వాత మళ్లీ గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. కడప నగరమంతా పలు ప్రాంతాల్లో గంజాయి బాగా దొరుకుతోంది. గంజాయి మత్తులో ఉన్న బ్యాచ్ బయట ఉంటే మహిళలు పగలే ఒంటరిగా తిరగలేని పరిస్థితి నెలకొంది. కడప నగరమే కాదు.. బద్వేలు, ప్రొద్దుటూరులోనూ గంజాయి దొరుకుతుండడం గమనార్హం. అక్కడ కొందరు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే విమర్శ ఉంది. పోలీసుల అండతోనే ఇదంతా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

గ్యాంబ్లింగ్



జిల్లాలో మళ్లీ గ్యాంబ్లింగ్ యథేచ్ఛగా సాగుతోందని అంటున్నారు. కడప నగరంతో పాటు చెన్నూరు, వేంపల్లె, పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురంలో ఎక్కువగా ఉందని సమాచారం. వేంపల్లె మండలంలోని సీతారంపల్లె, వెలమవారిపల్లె మధ్య ఎర్రకొండల్లో మంగతాయి ఆడుతున్నట్లు సమాచారం. ఇక పులివెందులలో కూడా సాగుతున్నట్లు చెబుతారు.

ప్రమాదకరంగా బైక్ రైడింగ్..



యువత బైకు రైడింగ్ ప్రమాదకరంగా ఉంది. కడప నగరంలోనే కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వెళ్లే రహదారి, రాజారెడ్డివీధి, నాగరాజుపేట, అప్సర-రాజంపేటరోడ్డు, రింగురోడ్డు, అల్మాస్‌పేట, పులివెందుల రోడ్డు తదితర చోట్ల యువత బైకు రైడింగ్ పాదచారులను, ద్విచక్ర వాహనదారులను భయంగొలిపేలా చేస్తోంది. మమ్మల్ని ఆపేదెవరు అన్నట్లుగా అడ్డగోలుగా డ్రైవింగ్ చేస్తున్నారు. వీరిని కట్టడి చేయకపోవడంతో పోలీసులపై తీవ్ర ఆరోపణలున్నాయి.

భూకబ్జాలపై ఉదాసీనత



వైసీపీ హయాంలో జిల్లాలో విచ్చలవిడిగా భూకబ్జాలు జరిగాయి. వాగులు వంకలు, చెరువులు ఇతర భూములన్నీ ఫోర్జరీపత్రాలతో ఆక్రమించారు. వాటికి సంబంధించి కేసులు నమోదైనా అరెస్టు చేసేందుకు పోలీసులు ముందుకు రావడంలేదని చెబుతారు. బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో వైసీపీ వారిపై నమోదైన కేసుల విషయంలో పోలీసులు నాన్చుడు ధోరణి వ్యవహరించడంతో చివరికి కలెక్టరే రంగంలోకి దిగాల్సి వచ్చింది. బద్వేలు, కడపలో భూకబ్జాలు మళ్లీ మొదలయ్యాయి. బాధితులు స్టేషన్‌లకు వచ్చినా సరైన న్యాయం జరగడం లేదన్న విమర్శ ఉంది.

కేసులవిచారణ నత్తనడకన

వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంశాఖ మంత్రి అనిత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులపై అసభ్యకరరీతిలో పోస్టులు పెట్టారు. అతనిపై జిల్లాలో పెద్దఎత్తున కేసులు నమోదయ్యాయి. అయితే వాటి విచారణ వేగంగా ముందుకు సాగడం లేదు. యోగివేమన విశ్వవిద్యాలయం వద్ద వేంపల్లెలో పనిచేస్తున్న కానిస్టేబులు శ్రీనివాసరెడ్డి కారు ప్రమాదానికి గురై రెండు కాళ్లు తెగిపోయాయి. అయితే విచారణలో దీని వెనుక పెద్ద కుట్ర ఉందనే చర్చ నడిచింది. ఓ బిజినెస్‌లో భారీగా డబ్బులు చేతులు మారాయని విచారణలో పోలీసులు గుర్తించారు. శ్రీనివాసరెడ్డి విచారణలో వెలుగులోకి వచ్చిన విషయాలు చూసి అప్పటి ఎస్పీనే అవాక్కయ్యారంటారు. దీంతో వేంపల్లెలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న పోలీసులందరినీ అప్పట్లో ఎస్పీ బదిలీ చేశారు. ఆ ఎస్పీ బదిలీ అయిన తరువాత శ్రీనివాసరెడ్డి కేసు అలాగే వదిలేశారు. ఒకప్పుడు వైసీపీతో తిరిగిన రౌడీషీటర్లు ఇప్పుడు కొందరు టీడీపీ నేతలతో అంటకాగుతున్నారు. వీరందరినీ అదుపులోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. పోలీసు బాస్ పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపట్టాల్సి ఉంది. ఇక కళ్లు, చెవులులాంటి ఎస్బీ విభాగాన్ని బాగా పటిష్ఠం చేసుకోవాల్సి ఉంది.

డీటీసీలో కామపిశాచి

- మహిళా అధికారులు, సిబ్బందికి వేధింపులు
- పాపం పండి.. దేహశుద్ధి
- కరుడుగట్టిన వైసీపీవాదికి కీలక పోస్టు కట్టబెట్టిన కూటమి ప్రభుత్వం

కడప, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఓ కామపిశాచి రాసలీలల ధాటికి అక్కడ పనిచేసే మహిళా అధికారులు, సిబ్బంది హడలెత్తిపోతున్నారు. వైసీపీకి హార్డ్‌కోర్ అభిమాని అయిన ఆ అధికారిని కూటమి నేతలు పట్టుబట్టి మరీ తెచ్చుకున్నారంటారు. కేవలం సామాజికవర్గం అనే నెపంతోనే ఆయనను తెచ్చారంటారు. తోటి సిబ్బందిని, పనిచేసే మహిళలను కుటుంబంలా భావించి పనిచేయాల్సిన ఆ అధికారి.. దీనికి భిన్నంగా కామాంధుడుగా మారి సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. గతంలో ఓ మహిళా అధికారి ఈ కామాంధుని వేధింపులు భరించలేక బదిలీ చేసుకుని వెళ్లిపోయారు. ఇప్పుడు మరో మహిళా అధికారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో ఓపిక నశించిన ఆ బాధితురాలి భర్త.. సదరు కామాంధుడిని చితక్కొట్టడం ఇపుడు హాట్‌టాపిక్‌గా మారింది.

కడప జిల్లా రవాణా శాఖ కార్యాలయం సీకేదిన్నె మండల పరిధిలో ఉంది. ఇక్కడ డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు సాగుతుంటాయి. ఇక్కడ డీటీసీ, ఎంవీఐలు ఇతర సిబ్బంది పనిచేస్తుంటారు. వీరిలో మహిళలు, పురుషులు ఉన్నారు. అయితే ఇక్కడ పనిచేసే ఓ ఉన్నతాధికారి తనలో మన్మథరాజాను బయటకు తెచ్చి మహిళా ఉద్యోగిణుల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఓ మహిళా అధికారిని ఇలానే వేధించగా ఆమె భరించలేక ఇక్కడి నుంచి బదిలీచేసుకుని వెళ్లిపోయారు. ఇక మరో మహిళా అధికారి వెంటపడడం మొదలుపెట్టాడు. వాట్సాప్ కాల్ చేయడం.. వాట్సాప్ మెసేజ్‌లలో నన్ను సుఖపెట్టు అంటూ వేధింపులకు గురిచేశారంటారు. నేను మీ కూతురులాంటిదాన్ని వేధించద్దు అని ప్రాధేయపడినా అతడిలో మార్పు రాలేదు. ఎంతలా అంటే కొవ్వెక్కి నేరుగా ఆ మహిళా అధికారి ఇంటికే వెళ్లాడు. అతను ఇంటికి వస్తుండడం గమనించి ఆమె భర్తకు ఫోన్‌ద్వారా తెలిపారు.

ఆ కామాంధుడు ఇంటికి వచ్చి ఎంతసేపు తలుపు తట్టినా ఆమె డోర్ తీయలేదు. ఇవన్నీ పక్క జిల్లాలో పనిచేస్తున్న ఆ మహిళా అధికారి భర్త సీసీకెమెరాలో చూసి తట్టుకోలేక పోయారు. ఆ కామాంధుడికి ఆమె భర్త ఫోన్ చేసినా అతడు ఫోన్ లిఫ్ట్ చేయకుండా ఇంటి బయటే చాలాసేపు కూర్చున్నాడు. ఈ నేపథ్యంలో తన భార్యను తీసుకుని అతడు గురువారం కత్తి చేతపట్టుకుని కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మీటింగ్‌లో ఉన్న అధికారిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. తోటి ఉద్యోగులు అతడని పట్టుకొని బయటకు తీసుకొచ్చారు. మీటింగ్ అయిపోయిన తర్వాత కామాంధుడి చాంబర్‌లోకి వెళ్లి చితక్కొట్టారు. ఇలాంటి తప్పు ఎప్పుడూ చేయను అని బాధితురాలి భర్త కాళ్లు పట్టుకోవడంతో.. నా కాళ్లు కాదు.. నా భార్య కాళ్లు పట్టుకో అని కేకలేశారు. సదరు ఉన్నతాధికారి మహిళా అధికారి కాళ్లు పట్టుకోవడంతో అతను వదిలేశాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లకుండా ఉండేందుకు బాధితురాలి కుటుంబ సభ్యులను వేడుకున్నాడు. ఈ వ్యవహారాన్ని బయటకు తేవద్దంటూ కామపిశాచి అక్కడి సిబ్బందిని వేడుకోవడం గమనార్హం.

ఇతను వైసీపీ హార్డ్‌కోర్. అయితే ఇక్కడున్న టీడీపీ ప్రజాప్రతినిధులు కేవలం తమ సామాజిక వర్గం అనే నెపంతోనే ఇతడిని తీసుకొచ్చారంటారు. ఈయన గతంలో పనిచేసిన గుంటూరు జిల్లాలో కూడా ఇలాంటి ఘటనలకు పాల్పడడంతో అక్కడ కూడా అతడికి దేహశుద్ధి జరిగిందని సమాచారం. ఇప్పుడు కడపలోనూ అలానే ప్రవర్తించడం రవాణాశాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.

ముగ్గురికి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

కడప కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఓటర్ల జాబితా తయారీలో బాధ్యతా యుతంగా విధులు నిర్వహించిన ముగ్గురికి ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2024ను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ ప్రకటించారు. కమలాపురం తహశీల్దార్, ఏఈఆర్వో శివరామిరెడ్డితో పాటు పులివెందుల నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం 131లో బీఎల్వోగా విధులు నిర్వహించిన ఎస్.గౌతమి, ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రం 253 బీఎల్వోగా పనిచేసిన ఎల్‌సీ గంగిరెడ్డి అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీన జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వీరు ముగ్గురూ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ఆదాయం రూ.4.62 కోట్లు



కడప మారుతీనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ కడప జోన్‌కు రూ.4.62 కోట్ల ఆదాయం సమకూరింది. సంక్రాంతికి ప్రయాణికుల సౌకర్యం కోసం కడప జోన్ వ్యాప్తంగా ఉన్న 8 డిపోల నుంచి 1,695 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. వీటిద్వారా ఈనెల 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఆర్టీసీకి రూ.4.62 కోట్ల ఆదాయం సమకూరింది. సుమారు 1.53 లక్షల మంది ప్రయాణికులు ఇటు అటు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసినట్లు తెలిసింది. కాగా 2024వ సంవత్సరంలో ఇదే సంక్రాంతికి కడప జోన్ వ్యాప్తంగా 1,739 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయగా అప్పట్లో రూ.4.66 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరినట్లు తెలిసింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 44 బస్సులు తగ్గించడంతో పాటుగా రూ.4 లక్షల ఆదాయం కూడా తగ్గింది.

జిల్లాలు	బస్సులు	ఆదాయం రూ.లక్షల్లో..
తిరుపతి	195	61.85
చిత్తూరు	165	43.44
అనంతపురం	167	37.06
కడప	412	116.63
నంద్యాల	193	46.35
కర్నూలు	228	58.73
అనంతపురం	158	51.61
శ్రీ సత్యసాయి	177	47.90
మొత్తం	1,695	462.77

రేపు డయల్ యువర్ ఆర్ఎం

ఆర్టీసీకి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను తమ దృష్టికి తేవాలని కోరారు.



కేఎంసీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

6

మద్దతు ధరతో కందుల కొనుగోలు

- క్వింటాల్ రూ.7,550 : జేసీ

కడప కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్ ఆధ్వర్యంలో రైతుల నుంచి కందులు క్వింటాల్ రూ.7,550 మద్దతు ధరతో కొనుగోలు చేయనుందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా వీటిని కొంటారని అయితే.. కంది పంటకు ఈ-క్రాప్ చేయుంచుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. త్వరలో కందుల కొనుగోలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతు సేవ కేంద్రంలో ఇంకా పేర్లు నమోదు చేయించుకోని రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. తేమ 12శాతం లోపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కందిపంట పండించిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.



ఈ-ఆఫీస్ వేగవంతం

- ప్రభుత్వ కార్యాలయాల్లో 100 శాతం అమలు చేయాలని ఆదేశాలు
- 25 తరువాత కాగితపు ఫైళ్లు ఉండరాదని ఉత్తర్వులు
- నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు
- నివేదికలు పంపాలని ఆదేశం
- పరిపాలనలో పారదర్శకతకు చర్యలు



జడ్పీలో ఈ-ఆఫీస్ విధానాన్ని చేపడుతున్న అధికారులు

కడప రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రభుత్వ కార్యాలయాల పరిపాలనలో కాగితపు రహిత పాలన(ఈ-ఆఫీస్) వేగవంతానికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఐటీ రంగాన్ని విస్తరింపజేసిన ఆయన 2014లో నవ్యాంధ్రప్రదేశ్ మొట్టమొదటి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా సేవలందించాలనే లక్ష్యంతో ఈ-ఆఫీస్ విధానాన్ని అమలులోకి తెచ్చారు. తద్వారా 2014-19 మధ్యకాలంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 50 నుంచి 70 శాతం వరకు ఈ-ఆఫీస్ విధానం అమలులోకి వచ్చింది. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఈ-ఆఫీస్ విధానం నత్తనడకకు పరిమితమైంది. 2024లో తిరిగి చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ-ఆఫీస్ విధానాన్ని మళ్లీ పరుగులు పెట్టిస్తున్నారు.

కాగితపు ఫైళ్లు ఉండరాదని ఉత్తర్వులు

ఈ నెల 25 తరువాత కాగితపు ఫైళ్లు ఉండరాదని పీఆర్ అండ్ ఆర్డీ శాఖ అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా, డివిజనల్, మండల స్థాయి కార్యాలయాలలో పూర్తిగా ఈ-ఆఫీస్ విధానం వినియోగంలోకి తీసుకుని రావడానికి కాగితపు రహిత ఫైళ్ల విధానాన్ని అమలు చేయాలని సూచించింది. ఇందుకు అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులందరికి ప్రభుత్వ ఇ-మెయిల్ సౌకర్య వెంటనే ఏర్పాటుచేయాలని పేర్కొంది. ఆయా కార్యాలయాల్లో కాగితపు విధానం ద్వారా ఉన్న ఫైళ్లను వెంటనే స్కాన్ చేసి సంబంధిత ఉద్యోగుల ఈ-ఆఫీస్ లాగిన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పింది. అలాగే.. కార్యాలయాలకు వచ్చిన లేఖలను వెంటనే స్కాన్ చేసి సంబంధిత సిబ్బందికి ఇన్‌వార్డ్ విభాగము ఈ-ఆఫీస్ ద్వారా పంపాలని పేర్కొంది. ఈ-మెయిల్ ద్వారా అందుకునే లేఖలను సైతం ఇన్‌వార్డ్ విభాగము వారు ఈ-ఆఫీస్ ద్వారా సంబంధిత సిబ్బందికి పంపాలని తెలిపింది. ఈ మేరకు జనవరి 20 లోపు కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన శిక్షణ, ఈ-మెయిల్ ఖాతాలు, ఈ-ఆఫీస్ విధానంలో ఫైళ్లను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈవో, డీపీవోలను ఆదేశించింది. జనవరి 25 తరువాత కాగితపు ఫైళ్లను ఎవరైనా ఉపయోగిస్తే సంబంధిత కార్యాలయ అధికారి, ఆ శాఖకు సంబంధించిన జిల్లా అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది. ప్రతి 15 రోజులకొకసారి ఈ-ఆఫీస్ అమలు తీరుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని, జడ్పీ, డీపీవో శాఖలలో పూర్తిగా ఈ-ఆఫీస్ అమలుకు తీసుకున్న చర్యలపై నివేదికలు పంపాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది.

అమలుపై శ్రద్ధపెట్టిన అధికారులు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వుల మేరకు జిల్లా ప్రజాపరిషత్ శాఖలో ఈ-ఆఫీస్ విధానాన్ని 100 శాతం అమలులోకి తీసుకొచ్చేందుకు అధికారులు శ్రద్ధపెట్టారు. జడ్పీ కేంద్ర కార్యాలయంలోని 8 సెక్షన్లలో పీఎఫ్ విభాగాలు తప్ప మిగిలిన సెక్షన్లన్నింటిలోను ఈ-ఆఫీస్ ద్వారా ప్రతి రోజు 30 నుంచి 40 ఫైళ్ల వరకు రన్ అవుతున్నాయని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. జడ్పీ కేంద్రంలో ఇప్పటికే 80శాతం వరకు ఈ-ఆఫీస్ విధానం కొనసాగుతోందన్నారు. జిల్లా పంచాయతీశాఖలోని ఫైళ్లను కంప్యూటరైజ్ చేస్తున్నామని డీపీవో రాజ్యలక్ష్మి తెలిపారు. డివిజనల్, మండల స్థాయిలో ఈ-ఆఫీస్ విధానం పూర్తిస్థాయి నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ నుంచి కలెక్టరేట్‌కు ప్రతి ఫైలును ఈ-ఆఫీస్ ద్వారానే పంపుతున్నామని ఎస్ఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన ప్రతి వ్యవహారమూ ఈ-ఆఫీస్‌లోనే కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలోని ఈఈ, ఏఈ కార్యాలయాలలోను ఈ-ఆఫీస్ అమలులోకి తీసుకుని రావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆఫీసులకు చేరిన కంప్యూటర్లు, ప్రింటర్లు

అన్ని ఆఫీసులకు కొత్తగా కంప్యూటర్లు, ప్రింటర్లు చేరాయి. కంప్యూటర్ ఆపరేటింగ్ విషయంలో అధికారులు శిక్షణ తీసుకున్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారిలో చాలా మందికి కంప్యూటర్‌పై అవగాహన ఉండగా పాత తరం అధికారులకు పెద్దగా అవగాహ లేకపోవడంతో తగిన శిక్షణ పొందుతున్నారు. ఎంపీడీవో కార్యాలయాల్లో కంప్యూటర్లను ఆపరేట్ చేసేందుకు ప్రత్యేకంగా ఉద్యోగులను నియమించుకున్నారు.

రాష్ట్ర భవిష్యత్తు ఆశాకిరణం నారా లోకేశ్

- మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలుటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు ఆశాకిరణం నారా లోకేశ్ అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కూటమి నేత బొజ్జ రోశన్న పేర్కొన్నారు. గురువారం బద్వేలు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నారా లోకేశ్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సభల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే విధంగా కృషిచేస్తున్నారన్నారు. యువగళం పేరుతో పాదయాత్రచేసి రికార్డు నెలకొల్పి మంత్రిగా అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకోసం పరితపిస్తూ, తాతకు తగ్గ మనవడుగా, తండ్రికి తగ్గ తనయుడుగా టీడీపీలో కోటికిపైగా సభ్యత్వ నమోదుతో రికార్డులు నెలకొల్పాడన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ల జీవించాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. అనంతరం కేకు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంగల్‌రెడ్డి, ఏఓ సుధాకర్‌రెడ్డి, మిత్తికాయల రమణ, జగదీశ్వరరెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, బిగ్‌బాస్, రామచంద్రారెడ్డి, పీవీఎస్ ప్రసాద్, సింగసాని బుజ్జి, సింగరయ్య, గోపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, మాచుపల్లె లక్ష్మీదేవి, విజయ్, బెనర్జీ, నాగభూషణం, శివ, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా కేకు కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బొజ్జ రోశన్న తదితరులు

మళ్లీ తెరపైకి డిటెన్షన్.?!

- విద్యార్థులు పాసైతేనే పైచదువులకు
- ఇకపై 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం
- ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టానికి సవరణ
- ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిటెన్షన్ విధానం మళ్లీ తెరపైకి వచ్చింది. పాఠశాల స్థాయిలో 5, 8 తరగతుల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే పైతరగతులకు పంపించే డిటెన్షన్ పాలసీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిటెన్షన్ అమలుతోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగి పైచదువుల్లో రాణిస్తారని కేంద్రం ఆలోచన చేస్తోంది. ఈ విధానం ప్రైవేట్ పాఠశాలలకు లబ్ధి చేకూరుస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర క్యాబినెట్‌లో కూడా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో డిటెన్షన్ విధానంపై ప్రత్యేక కథనం..

కేంద్ర ప్రభుత్వం పిల్లల ఉచిత నిర్బంధ విద్యాచట్టం-2010కి సవరణలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. మారిన నిబంధనలను పిల్లల ఉచిత మరియు నిర్బంధ విద్య (సవరణ) నియమాలు-2024 అని పిలుస్తారు. తాజా సవరణ నిబంధనల ప్రకారం 5, 8 తరగతుల్లో విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని పిల్లలను అదే తరగతులకు డిటైన్ చేస్తారు. అంటే పై తరగతికి పంపించరు. ఫలితాల ప్రకటన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలో విద్యార్థులకు తిరిగి పునఃపరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారిని మాత్రమే పై తరగతులకు ఉన్నతీకరిస్తారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను కూడా చైతన్యపరచాల్సి ఉంటుంది. ఆ పాఠశాల అధిపతి వెనుకబడిన విద్యార్థుల జాబితాలు తయారు చేసుకుని వ్యక్తిగతంగా వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పరీక్ష మరియు పునఃపరిశీలన అనేది పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధించడానికి సామర్థ్య ఆధారిత పరీక్షలుగానే ఉండాలి కానీ కంఠస్థం మరియు విధానపరమైన నైపుణ్యాలపై ఆధారపడి ఉండకూడదని తాజా సవరణ ఉత్తర్వుల్లో కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. దీనికై కేంద్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. దీనితో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూల్లో మరియు ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆధీనంలో పనిచేస్తున్న బడుల్లో కొత్త డిటెన్షన్ విధానం అమల్లోకి వస్తుంది. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వాలకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ప్రకారం అమలు పరచడంలో ఆప్షనల్‌గా నర్ణయించుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నందున అమలుపరిచే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

1970 వరకు డిటెన్షన్ విధానం

ఉమ్మడి రాష్ట్రంలో 1970 వరకు ప్రాథమిక విద్యలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేది. విద్యార్థులు బడులకు దూరంగా ఉండేవారు. అప్పటి వరకు డిటెన్షన్ విధానం అమల్లో ఉండేది. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు, మధ్యలో బడి మానేసే పిల్లల సంఖ్య (డ్రాపౌట్స్)ను తగ్గించేందుకు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో 7, 10 తరగతులను మినహాయించి మిగిలిన తరగతులకు 1971లో నాన్‌డిటెన్షన్ (పరీక్షలతో సంబంధం లేకుండా పైతరగతికి పంపడం) విధానాన్ని ప్రవేశపెట్టారు.



పరీక్షలు ఒక్కటే ముఖ్యం కాదు

ఏడో తరగతి తర్వాత పైతరగతికి వెళ్లాలంటే కామన్ ఎగ్జామ్స్ విధానాన్ని 1971 నుంచే అమలు చేశారు. గణిత, సైన్స్, ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా చూడాలన్న లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే పాఠ్యాంశాల బోధనకు తగినట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోను పరీక్షల నిర్వహణ ఓ పార్సుగా మారింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్ని ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. దీనివల్ల పరిస్థితులు విషమిస్తున్నాయన్న ఉద్దేశంతో 7వ తరగతిలో కామన్ పరీక్షల విధానానికి 2008లో విద్యాశాఖ స్వస్తి చెప్పింది. ఈ నేపథ్యంలో ఎక్కువమంది డిటెన్షన్ విధానం వద్దని అభిప్రాయపడుతున్నారు. నాన్ డిటెన్షన్ విధానం వలన పిల్లలు ఏటా పై తరగతికి వెళ్తుండడంతో డ్రాపౌట్స్ శాతం క్రమంగా తగ్గింది. అక్షరాస్యత పెరుగుతూ వస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పించి ఇతర పనుల్లో పెట్టకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడుతోంది. విద్యార్థుల్లో పరీక్షల భయం తగ్గింది.

బడుగు బలహీన వర్గాల పిల్లలు పాఠశాలలకు రావడం క్రమేణా పెరిగింది. బాలికల్లో అక్షరాస్యత సైతం నాన్ డిటెన్షన్ విధానం వల్లనే సాధ్యమైందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే.. డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తే విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో బాధ్యత పెరుగుతుందని, ఉపాధ్యాయులు శ్రద్ధతో బోధన చేస్తారనే వాదనా వినిపిస్తోంది. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని, ఉన్నత విద్యలోను రాణిస్తారని అంటున్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో కానీ.. పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు మాత్రం 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం వద్దనే అంటున్నారు.

డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి



కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 5, 8 తరగతుల డిటెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య పిల్లలకు అందాలంటే 9వ తరగతి వరకు నాన్ డిటెన్షన్ విధానం మాత్రమే ఉండాలి. 10వ తరగతి నుంచి మాత్రమే డిటెన్షన్ విధానం అమలు చేయాలి. లేకుంటే డ్రాపౌట్ల శాతం పెరుగుతుంది. ఉచిత నిర్బంధ విద్యకు తూట్లుపడతాయి. ఒక వేళ తప్పదు అనుకుంటే 8వ తరగతికి మాత్రమే డిటెన్షన్ విధానాన్ని ఆలోచించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

సమర్థనీయం కాదు



బాలలందరికి ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యను అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. డిటెన్షన్ విధానం వలన గ్రామీణ ప్రాంతాలలో డ్రాపౌట్ శాతం పెరిగే అవకాశం ఉంది. గతంలో 7వ తరగతికి సంబంధించి కామన్ పరీక్షలు ఉన్న విషయం మనకు తెలిసిందే. కానీ ఆచరణలో అది సరైన రీతిలో ఫలితాలను ఇవ్వలేకపోవడం వలన దానిని తీసివేయాల్సి వచ్చింది. కావున డిటెన్షన్ విధానమనేది 10వ తరగతి వరకు వాంఛనీయం కాదు.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

నో డిటెన్షన్ విధానాన్నే కొనసాగించాలి



తప్పనిసరిగా 5వ, 8వ తరగతిలోని విద్యార్థులు వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాస్ కాలేక, బడికి రాకుండా డ్రాపౌట్‌గా మిగిలే అవకాశం ఉంటుంది.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సరైన అవగాహన లేక, విద్యార్థులు ఉత్తీర్ణత కాలేక, ఒత్తిడి వలన పాఠశాలకు దూరమయ్యే అవకాశం ఉంది. విద్య అనేది రాష్ట్ర పరిధిలోని అంశం కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు అమలులో ఉన్న నోడిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.

-ఎస్.రామాంజనేయులు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు


డిటెన్షన్ విధానం ఉండాల్సిందే



ప్రస్తుత పరిస్థితుల్లో డిటెన్షన్ విధానం ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి, బోధన నైపుణ్యాలు పెంపొందించాలంటే డిటెన్షన్ విధానం అవసరం. గతంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండడం వలన నిరక్షరాస్యత రేటు తగ్గించాలనే ఉద్దేశంతో నాన్ డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం విద్య గురించి తల్లిదండ్రులందరిలో అవగాహన పెరిగింది. ప్రతి తల్లితండ్రి నాణ్యమైన విద్య కావాలని కోరుకుంటున్నారు. కాబట్టి డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నాం.

- లెక్కల జమాల్‌రెడ్డి, పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

డిటెన్షన్ విధానం వద్దు



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 5వ తరగతి, 8వ తరగతి విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రకటన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. గతంలో అనేక మందితో చర్చించిన పిదప 7వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్ రద్దు చేశారు. మరిప్పుడు 5వ, 8వ తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానం ఎందుకు? దీని వెనక బడుగు బలహీన పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర దాగి ఉంది. డిటెన్షన్ విధానం అమలు ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- బి.లక్ష్మీరాజా, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

కేఎంసీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కడప స్పోర్ట్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర మునిసిపల్ మైదానంలో గురువారం కేఎంసీ స్పోర్ట్స్ మీట్‌ను కడప నగర పాలక కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో 100, 400, 4 ఇంటూ 400 రన్నింగ్‌తో పాటు వాలీబాల్ పోటీలను వివిధ పాఠశాలల బాల, బాలికలకు నిర్వహించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

100 మీటర్ల బాలికల విభాగంలో... : 100 మీటర్ల బాలికల విభాగంలో ప్రథమస్థానం ఎం.శ్రీలతారెడ్డి (ప్రభుత్వ బాలికల పాఠశాల, కడప), ద్వితీయ స్థానం వేద వర్షిణి (స్పోర్ట్స్ స్కూల్), తృతీయస్థానం జె.కీర్తన (అంబేడ్కర్ స్కూల్) నిలిచారు.

బాలుర విభాగంలో... : 100 మీటర్ల బాలుర విభాగంలో బి.రాముడు (స్పోర్ట్స్ స్కూల్) ప్రథమస్థానం, జె.తిమోతి (గాంధీనగర్ స్కూల్) ద్వితీయ స్థానం, ఎల్.జస్వంత్‌రెడ్డి (కడపస్కూల్), తృతీయస్థానం సాధించారు

400 మీటర్ల రిలే పరుగులో... : 400 మీటర్ల రిలే పరుగులో విద్యామందిర్ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలువగా, ద్వితీయ స్థానం సాల నాగయ్య (మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్), తృతీయ స్థానం నాగరాజుపేట మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు సాధించారు.

వాలీబాల్ విభాగంలో... : వాలీబాల్ పోటీలలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించగా, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ అగాడి విద్యార్థులు ద్వితీయస్థానం, మున్సిపల్ మెయిన్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు.

నేడు బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు : స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 24వ తేదీ శుక్రవారం ఉదయం కబడ్డీతో పాటు బ్యాడ్మింటర్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



పరుగు పందెంలో బాలికలు

మదనపల్లెవాసికి
ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం

మదనపల్లె అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన యూత్ కరాటే క్లబ్ అధ్యక్షుడు ఏఆర్ సురేశ్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అందుకున్నారు. గురువారం హైదరాబాదులోని భాస్కర ఆడిటోరియంలో మాస్టర్ కేశవ కరాటే అకాడమీ ఇండియా వారి ఆధ్వర్యంలో పురస్కారం అందించారు.



ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారంతో సురేశ్

కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి వారి ప్రతిభతో పాటు సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందులకు ఈ పురస్కారం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కేశవ అకాడమీ అధ్యక్షుడు కేశవగౌడ్ మాట్లాడుతూ కరాటే వృత్తిలోనే కాకుండా తోటి మాస్టర్లు ఇబ్బందుల్లో ఉంటే వారికి ఆర్థికసాయం అందించడంలో ఏఆర్ సురేష్‌కు సాటి లేరన్నారు. కార్యక్రమంలో శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, లండన్, సౌదీ అరేబియా తదితర దేశాలతో పాటు 12 రాష్ట్రాల మాస్టర్లు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కురబ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శ్రీరామతులసి కల్యాణ మండపంలో భక్త శ్రేష్ట కనకదాస్ 537వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కురబ సంఘ ప్రతినిధులు, కార్పొరేట్ డైరెక్టర్లు, కురబ కులస్థులు పాల్గొన్నారు. ముందుగా కనకదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో కురబలు రాజకీయాల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నపటికీ రాజకీయంగా కురబలకు న్యాయం జరగడం లేదన్నారు. కురబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ముందుకు రావాలన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చైతన్య యాత్రలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 2వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పం నుంచి యాత్రలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుమల పుణ్యక్షేత్రంలో ఇతర కులాలకు కేటాయించిన విధంగా కురబల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలన్నారు. టీటీడీ, శ్రీశైలం దేవస్థానాల్లో కమిటీల్లో కురబలకు అవకాశం కల్పించాలన్నారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల లోన్లు కురబ కులస్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన ప్రజాప్రతినిధులను, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు జ్ఞాపికలు అందించి సన్మానించారు. అనంతరం ఏపీ కురబ, కురుమ, కురువ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో మూడోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురబ యువత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తలపల్లె కోటి సురేశ్, యూత్ అధ్యక్షుడిగా కాటమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, లింగమూర్తి, విఠల్ గౌడ్, దండు కేశవ, కప్పల అనిల్, రిటైర్డ్ డీఎస్పీ పోతప్ప, జంజుడప్ప, సుధాకర్, ఈశ్వరయ్య, మురళి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు వలిగట్ల వెంకటరమణ, పరిమళ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

పంచాయతీలకు పండగే

- ఆర్థిక సంఘం నిధులు రూ.87.22 లక్షలు విడుదల
- గత ప్రభుత్వంలో నిధులు దారి మళ్లించిన వైనం
- సక్రమంగా వినియోగిస్తే పంచాయతీలకు మహర్దశ

సుండుపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు కూటమి సర్కారు చొరవతో మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా పురిపుష్టిని సంతరించుకోనున్నాయి. సుండుపల్లె మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మండలంలో 10 గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరిగాయి. సర్పంచులు కొలువుదీరిన తరువాత అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు. నిధుల లేమితో పంచాయతీల్లో లైట్లు సైతం మార్చలేని స్థితిలోకి వెళ్లాయి. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచులను పూర్తిగా కీలుబొమ్మలుగా మార్చారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించింది. దీంతో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడాయి. గ్రామ పంచాయతీల్లో కనీసం ప్రజలకు తాగు నీరు సైతం అందించలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే పంచాయతీలకు మంచిరోజులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధు లు విడుదల చేసి పంచాయతీలను ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు కేంద్రం చొరవతో కూటమి సర్కారు తొలి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది.

మండలానికి రూ.87.22 లక్షలు

మారుమూల సుండుపల్లె మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే సుండుపల్లె, ఈడిగపల్లె, సొంఠంవారిపల్లె గ్రామ పంచాయతీలకు సర్పంచు ఎన్నికలు జరగలేదు. పలు సమస్యలపై స్థానికులు కోర్టుకు వెళ్లడంతో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన భాగంపల్లె గ్రామానికి రూ.4,62,908, చిన్న గొల్లపల్లెకు రూ5,60,892, మాచిరెడ్డిగారిపల్లెకు రూ.7,44,783, మడితాడుకు రూ.18,24,703, ముడుంపాడుకు రూ.9,69,009, పొలిమేరపల్లెకు రూ.5,22,621, తిమ్మసముద్రానికి రూ.10,56,460, పెద్దినేనికాలువకు రూ.9,85,125, జి.రెడ్డివారిపల్లెకు రూ5,25,328, రాయవరానికి రూ.10,70,412 చొప్పున 10 గ్రామాలకు కలిపి రూ.87,22,241 నిధులు గ్రామ పంచాయతీ అకౌంటుకు జమ కావడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ నిధులతో గ్రామాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు పడనున్నాయి.






తిమ్మసముద్రం, జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాలు

దారి మళ్లించిన వైసీపీ సర్కారు

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను ఖాతాల్లోకి రాగానే దారి మళ్లించడంతో సర్పంచులు ఏం చేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. ప్రస్తుత కూటమి సర్కారు కేంద్ర ప్రభుత్వం చొరవతో నేరుగా పంచాయతీల ఖాతాలకే కేటాయించింది. దీంతో నిధులు పక్కదారి పట్టే అవకాశం లేకుండా పోయింది.

పంచాయతీలకు ఎంత నిధులొచ్చాయి అనే విషయాలను సర్పంచులు తెలుసుకునే వెసులుబాటు కలిగింది. మండలంలో పది పంచాయతీలకు టైడ్‌గ్రాంట్‌గా రూ.50,95,529 లక్షలు, అనైడ్ నిధులుగా రూ.36,26,712 లక్షలు మొత్తంగా రూ.87,22,241 లక్షలు మంజూరయ్యాయి.

అభివృద్ధి వైపు అడుగులు వేస్తాం



ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడవకముందే పంచాయతీలకు నిధులు విడుదల చేయడం సంతోషదాయకం. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు వినియోగిస్తాము. గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈ నగదు దోహదపడుతుంది. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

-మహమ్మద్ షరీఫ్, సర్పంచ్, రాయవరం

నిధులు సక్రమంగా వినియోగించాలి

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చూస్తాము. గ్రామ పంచాయతీలో ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలి. తాగు నీటి సమస్యలు లేకుండా చేస్తాము. నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తాము. ప్రతి రూపాయి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి.

-సురేశ్‌బాబు, ఈవోపీఆర్‌డీ, సుండుపల్లె

అయినా... తీరు మారడం లేదు

- మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..
- జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు
- అయినా కొందరిలో మార్పు అంతంతమాత్రమే
- 13 నెలల్లో 1430 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడటమే కాకుండా.. ఇతరుల ప్రాణాలను బలగొంటున్నారు. ఇక యువత మద్యం మత్తులో ఇష్టానుసారం వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో పోలీసులు మందుబాబులపై ప్రత్యేక నిఘా పెట్టి జరిమానాలు వేసి జైలుకు పంపుతున్నప్పటికీ కొందరి తీరు మారడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసులు కడప జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి 13 నెలల్లో 1430 మందిపై కేసులు నమోదు చేశారు.



బ్రీతింగ్ ఎనలైజరుతో తనిఖీ చేస్తున్న పోలీసులు

మద్యం తాగి జైలుకెళ్లిన సందర్భాలెన్నో....

కడపకు చెందిన ఓ ఆటోడ్రైవరు మద్యం తాగి వాహనం నడుపుతూ నాలుగు నెలల క్రితం పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ డ్రైవరుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడంతో రూ.10వేలు జరిమానాతో పాటు 30 రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే కడపకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా అతనికి 15 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3వేలకు పైగానే జరిమానా విధించారు. ఓ కారు డ్రైవరు మద్యం తాగి వాహనం నడుపుతుండగా నగర శివార్లలో అతన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. వారం రోజులు జైలుశిక్ష వేసి జరిమానా విధిం చారు. ప్రస్తుతం ఎవరైనా మద్యం తాగి పట్టుబడితే వారికి కోర్టు రూ.10వేలు నుంచి నెలరోజుల పాటు జైలుశిక్ష వేయనున్నారు.

వాహనాల్లోనే బార్లు, మద్యం షాపులకు...

మద్యం తాగేందుకు యువతతో పాటు కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, డ్రైవర్లు, స్నేహితులతో కలిసి బార్లు, మద్యం షాపులకు వాహనాల్లో వెళుతున్నారు. బ్యాచ్‌లతో వెళుతున్న వీరు ఫుల్‌గా మద్యం సేవించి.. తాగిన మత్తులోనే వాహనాలను నడు పుతూ ప్రమాదాలకు గురవతున్నారు. మరికొందరు ఎదుటి వారిని ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారు.

నగర శివార్లలో.. మందుబాబుల తిష్ట

మద్యం షాపులలో మద్యం కొనుగోలు చేసి అక్కడ తాగే అవకాశం లేకపోవడంతో నగర శివార్లకు వెళ్లి అక్కడ ఓపెన్ ప్లేస్‌లో సిట్టింగ్ వేస్తారు. సరదాగా స్నేహితులతో కలిసి పీకల్లోతు మద్యం సేవించి ఆ మత్తులో వాహనాలు నడుతూ తరచూ ప్రమాదాలకు గురవతున్నారు. దీంతో గతంలో పనిచేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నగర శివార్లలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిచడంతో మందుబాబుల ఆగడాలు కాస్త సద్దుమణిగాయి. అయితే పోలీసుల నిఘా కొరవడటంతో ఇటీవల కొంత మంది యువత నగర శివార్లలో కొన్ని ప్రాంతా లను ఎంచుకుని వాహనాల్లో మద్యం తీసుకెళ్లి అక్కడ యథేచ్ఛగా తాగుతూ తూలుతుంటారు.

మందుబాబులపైనే పోలీసుల గురి

రాత్రివేళల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. నగర శివార్లతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద బ్రీతింగ్ ఎనలైజర్లతో తనిఖీలు చేపట్టి మందుబా బులను పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఈ 13 నెలల్లోనే 12,030 కేసులు కేసులు నమోదు కాగా మద్యం మత్తులో కాకుండా రాత్రుళ్లు తనిఖీల సమయంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న 1422 మందిపై కేసులు నమోదు చేశారు. ఇకపై కూడా కడప డీఎస్పీ వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో మందుబాబులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరంగానే కఠినంగా శిక్షించాలని నిర్ణయించారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. మద్యం తాగి పదే పదే పట్టుబడితే ఉపేక్షించేది లేదు. లైసెన్సు రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి పగలు అన్నివేళలా బ్రీతింగ్ ఎనలైజరుతో పరీక్షలు నిర్వహిస్తాం. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట నిలబెడతాం. కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపిస్తాం.

-జావీద్, కడప ట్రాఫిక్ సీఐ

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

సికెదిన్నె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, రమాదేవి, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వారి కార్యాలయము

ఏ.పి.ఇ.డబ్ల్యు.ఐ.డి.సి., ప్రగతి భవన్ మొదటి అంతస్తు, ఆర్.టి.సి. బస్టాండ్ రోడ్, కడప, వై.యస్.ఆర్.జిల్లా

AP - ఇ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

షార్ట్ టెండర్ నోటీస్ నిట్ నెం. 25,27 నుండి

52/EE/A.P.E.W.I.D.C./KDP/DM/2024-25 తేది 23.01.2025

వై.యస్.ఆర్.జిల్లా కడప నందు పై తెలిపిన నిట్ నెంబర్ల ద్వారా మొత్తం 27 పనులకు, రిజిష్టర్డ్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి AP-ఇ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా టెండర్లు కోరడమైనది.

టెండర్లు ఆరంభపు తేది 27-01-2025 మ. 3.00 గం.

టెండర్లు ముగింపు తేది 31-01-2025 మ. 3.30 గం.

తదుపరి వివరములకు కొరకు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, కడప వారి కార్యాలయం నందు పనివేళలో (93906 63855) తెలుసుకొనవచ్చును.

సం/- డి. గురివిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఏ.పి.ఇ.డబ్ల్యు.ఐ.డి.సి. కడప.

లారీ ఢీ - వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బద్వేల్ రోడ్డులో మోటర్ బైక్‌పై వెళుతున్న కంచర్ల సంటెయ్య (35)ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. ఎస్.ఎర్రబల్లె వాసి కంచర్ల సంటెయ్య వృత్తి రిత్యా ఫొటోగ్రాఫర్. మైదుకూరులోని ఓ ఫొటో స్టూడియోలో పనిచేసి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంటెయ్యకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారు పుట్టుకతో దివ్యాంగులని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన సి.మునిరెడ్డి (73) ప్రస్తుతం కడప కోఆపరేటివ్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య ంతో పాటు ఇతర సమస్యలతో బాధపడుతుండేవారు. గురువారం రామాంజనేయపురంలోని చర్చి వద్ద కూర్చుని మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చక్రాయపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిక్షేత్రం సమీపాన గురువారం ఆటో, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వడ్డెపల్లె గ్రామానికి చెందిన కొందరు ఆటోలో వేంపల్లెకు వెళ్తుండగా.. వేంపల్లె నుంచి బైకులో ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. గండికి సమీపంలోని పెద్దగుండు వద్ద కు రాగానే ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడి ప్రహరీగోడను ఆనుకుంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకపోతే పది మట్ల లోతులో పడిపోయేది. ఈప్రమాదంలో వెంకటేష్, వెంకటసుబ్బమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ముగ్గురు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఫేక్ డాక్యుమెంట్లతో వ్యవసాయ రుణాలు.. వ్యక్తి అరెస్టు



నిందితుని చూపుతున్న పోలీసులు

కమలాపురం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫేక్ డాక్యుమెంటు సృష్టించి వ్యవసాయ రుణాలు పొంది బ్యాంకులను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామానికి చెందిన మూల నాగేశ్వర్ రెడ్డి దొంగ డాక్యుమెంటు సృష్టించి పంట రుణాలు పొందినట్లు సమాచారం రావడంతో కడప ఎస్‌డీపీవో వెంకటేశ్వర్లు, కమలాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టరు షేక్ రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి విచారణ చేపట్టారు. గురువారం గ్రామ సమీపంలో నిందితుడు ఉన్నట్లు తెలియరావడంతో తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఫేక్ డాక్యుమెంట్లను స్వాధీనపరుచుకుని రిమాండుకు తరలించారు. కాగా, గతంలో కమలాపురం ఎమ్మార్వో ఆఫీసులో యల్లారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ వీఆర్వోగా విధులను నిర్వర్తించిన అంజి అలియాస్ రామాంజి డీకేటి భూములు, కొండలు, గుట్టలు ఇతర భూములకు సంబంధించి నాగేశ్వర్‌రెడ్డితో కలిసి ఫేక్ డాక్యుమెంటులను తయారు చేశారు. వాటి ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను మ్యుటేషన్ చేసి ఫేక్ డాక్యుమెంట్ల సృష్టించి బ్యాంకుల నుంచి ఎక్కువ మొత్తంలో క్రాప్‌లోన్లను పొంది.. ఆ డబ్బును పంచుకున్నారు. కమలాపురం మండలం, యల్లారెడ్డిపల్లె పంచాయతీలోని సర్వే నెం.645లో గల గండి సుబ్బలక్షుమ్మ అనే రైతుకు చెందిన భూమి రికార్డులను ఫేక్ డాక్యుమెంట్‌ల ద్వారా తమకు అనుకూలంగా మ్యుటేషన్ చేసుకుని ప్రొద్దుటూరు టౌన్‌లో గల కెనరా బ్యాంకు నుంచి క్రాప్ లోను ద్వారా రూ.2.50 లక్షలు తీసుకున్నారు. ఆ డబ్బులను తమ సొంతానికి వాడుకుని.. తిరిగి చెల్లించలేదన్నారు. ఇందుకు పాత్రులైన ఇంకా కొంత మంది ఉన్నారని వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు.

ఏఆర్ సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్



ఫైరింగ్ ప్రాక్టీసులో పోలీసు సిబ్బంది

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఏఆర్ పోలీసులకు గురువారం ఫైరింగ్ ప్రాక్టీసు చేయించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య పర్యవేక్షణలో నగర శివారులోని ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ పోలీసులకు వివిధ రకాల తుపాకులతో ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. మొబలైజేషన్‌లో భాగంగా వార్షిక ఫైరింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి వృత్తి నైపుణ్యం పెంచుకుందామని సూచించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు సిబ్బందికి ఫైరింగ్‌లో మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిపై వన్‌టౌన్ సీఐ దాడి

- కోర్టులో జడ్జికి బాధితుడి ఫిర్యాదు
- సీఐకి షోకాజ్ నోటీసులు ఇచ్చిన మేజిస్ట్రేట్

ప్రొద్దుటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో అరెస్టు అయిన నిందితుడిని ఒన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి స్టేషన్లో చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిందితుడు కోర్టులో జడ్జి ఎదుట తనపై సీఐ దాడిచేసిన విషయం వెల్లడించి.. గాయాలు చూపించడంతో సీఐకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... కేహెచ్ఎం వీధికి చెందిన హనీఫ్ తన తల్లిదండ్రులతో గొడవపడుతూ వారిని వేధించేవాడు. సుందరాచార్యుల వీధికి చెందిన మహ్మద్ అలీఖాన్ జనవరి 19న హనీఫ్ తీరును ప్రశ్నించాడు. దీంతో నీవేంది నాకు చెప్పేది అని మహ్మద్ ఖాన్‌పై హనీఫ్ దాడిచేశాడు. ఈ దాడిలో మహ్మద్‌ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. మహ్మద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనీఫ్‌ను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఫస్ట్ ఏడీఎం కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచగా తనపై ఒన్ టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి దాడిచేసి కొట్టాడని వీపుపై వున్న రక్తగాయాలను మేజిస్ట్రేట్‌కు చూపించాడు. దీనిపై సీఐని వివరణ ఇవ్వాలని గురువారం మేజిస్ట్రేజ్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనిపై సీఐని వివరణ కోరగా షోకాజ్ నోటీసు ఇచ్చింది వాస్తవం అని తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 25వ తేదీ శనివారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం వరకు క్రికెట్ దిగ్గజం కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ రాష్ట్రస్థాయి నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు (రెండు-మ్యాచ్‌లు) నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. ఇందులో ఆంధ్ర, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ జట్లు తలపడనున్నాయన్నారు. ఆమేరకు ఈనెల 25 నుంచి 28 వరకు ఆంధ్ర-పంజాబ్ జట్ల మధ్య పోటీలు సాగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4 వరకు జరుగనున్న రెండో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు హిమాచల్‌ప్రదేశ్ జట్టుతో తలపడుతుందన్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్ర జట్ల క్రీడాకారులు కడపకు చేరుకుని సంబంధిత ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రాక్టీస్ సెషన్‌లో నిమగ్నమయ్యారు. కాగా మ్యాచ్ నిర్వహించేందుకు అనువుగా క్రికెట్ మైదానాన్ని మార్కింగ్‌తో సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ జీవనశైలితో ప్రభావవంతమైన సమాజం : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడ ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం కాంతులీని ప్రభావవంతమైన సమాజం ఏర్పడుతుందని వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. తమిళనాడు పెరంబుదూర్‌లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ భారత ప్రభుత్వ పార్లమెంట్ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వైవీయూ ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంపై (యూత్ మెంటర్ హెల్త్ ప్రమోషన్‌పై టీఓటీ ప్రోగ్రాం)పై శిక్షకుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. మాట్లాడుతూ సమాజంలోని ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత భేదాలు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ఇంటర్‌నెట్‌లో ఎక్కువటైం గడపడం వలన అనేక మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రతిరోజు కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లకు సమయం కేటాయించాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్ డాక్టర్ ఝాన్సిరాణి, డాక్టర్ లలిత, డాక్టర్ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

ఈఎఫ్ఏయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ 5,7,3 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ఫలితాలు విడుదల చేసేందుకు కృషిచేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి జి.ఫణేంద్రరెడ్డి, సహాయ అధికారి ఉదయప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి, వి.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై వైవీయులో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అన్నారు. మహిళలను గౌరవించడం ద్వారా పని వాతావరణం పెరిగి మంచి ఫలితాలు వస్తాయన్నారు. న్యాయవాదులు ఎస్.పర్వీన్ నాజ్, జి.ఉమ, సైకాలజిస్ట్ సునీత వర్క్‌ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపులు చట్టంపై అవగాహన కల్పించారు. సఖి, వన్‌స్టాప్ సెంటర్ సునీత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


కొత్తపేటలో లేగదూడల ప్రదర్శన





మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక అధికారి, ప్రదర్శనలో ఉన్న లేగదూడలు

పెండ్లిమర్రి,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ రమణయ్య ప్రారంభించగా.. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 65 దూడలను ప్రదర్శించారు. దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే మొదటి, రెండు, మూడవ బహుమతులను దూడల యజమానులకు అందజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా రైతులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, డాక్టర్ సురేష్ పశువులలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ ప్రాముఖ్యతను వివరించారు. కడప డీఎల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.1350 ధర నిర్ణయించి... సబ్సిడీ రూ.850 రైతు రూ.500చెల్లిస్తే లింగ నిర్ధారిత వీర్యం అందిస్తోందన్నారు. వాటి ప్రాముఖ్యతను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. డాక్టర్ శరత్ మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భకోశవ్యాధులు, దూడల పెంపకం, లింగనిర్ధారణ వీర్యం వల్ల లాభాలను వివరించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఫిలిం యాక్టర్స్ కావలెను

షార్ట్ ఫిలిం కొరకు చైల్డ్ యాక్టర్స్ మరియు యంగ్ యాక్టర్స్ కావలెను. ఆసక్తిగల యువకులు షార్ట్ ఫిలింలో నటించే అవకాశం కలదు. ఎవరైన యాక్టింగ్ చేయుటకు ఉత్సాహం, ఆసక్తిగల అభ్యర్థులు ఈ క్రింది నెంబరును సంప్రదించంగలరు. సెల్ : 91004 75355

Ajc-224699

WANTED

కడప నగరంలోని ప్రముఖ నజ్‌ముల్ అమీన్ స్కూల్‌నందు 6 to 10 బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్స్ బోధించుటకు అనుభవం కల టీచర్స్ కావలెను. సంప్రదించండి: 77805 01017

Ajc-224628

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122.

Ajc-224694

ఒవేల్ జూనియర్ కాలేజ్, నెల్లూరు

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ 5 సం॥ అనుభవం కలిగిన వారు కావలెను. దిగువ కేంద్రం నుండి కడప, బద్వేల్, రాయచోటి, మైదుకూరు, కలసపాడు, చెన్నూరు, ఖాజీపేట, రాజంపేట, చిట్వేల్, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ళ, వేంపల్లి, కదిరి, జమ్మలమడుగు పులివెందుల. సాలరీ రూ. 20,000/- నుండి 30,000/-. బయోడేటా పంపవలసిన నంబర్ 87126 15168, 91000 41475

Ajc-000

LOSS OF PASSPORT

I, TANGALA BHUDEVI Wife of THANGALA SREERAMULU, Naguruvandlapalli Village, Bonamala Post, Chinnamandem Mandal, Annamayya District, A.P., Lost of Passport No.T3493670, Lost While I was traveling by APSRTC Bus from Chinnamandem to my Village Bonamala.

AJC-000

CHANGE OF NAME

I, AHMED ANWAR HUSSAIN SAB(Old name) S/O ANUPURU HUSSAIN SAHEB, residing at Door No.6/147-A, R.S.Road, Rajampet Town & Mandal, Annamayya District, A.P., hearby changed my Surname as ANUPURU AHAMAD (New name), My father Surname as ANWAR HUSSAIN SAB TO ANUPURU HUSSAIN SAHEB, My Mother Surname as ANWAR AMENA BEE TO ANUPURU AMEENA BEE

AJC-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిప్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA-224890

ONE SITTING

10th/Inter / Degree / P.G. MPC / BiPC, M.Bi.P.C. /C.E.C., B.A., B.Com., B.Sc. (C), M.A., M.Com., M.Sc (C), B.Tech (All). Exams : March / October. SEA Academy, Y Junction, Kadapa. Cell : 99493 93809, 76740 90494

AJC-224700

WANTED TELECALLERS

Work from kadapa city qualification..inter (only ladies) attractive salary Cell 90104 43277

AJC-224695

ONE SITTING

Discontinued or ఫెయిలైన విద్యార్థులకు సం॥లో పాస్ అయ్యే అవకాశం. 10th / Inter / Degree / PG / Diploma/ B.Tech./ LLB / Certificate Courses, UGC Regd. Universities, Sri Sai Education, Kadapa, Cell : 98855 11226

Ajc-224629

బార్బర్ షాప్ సామాగ్రి అమ్మకము

కడప నగరంలోని ప్రముఖ బార్బర్ షాపు మూసివేయటం వలన అందులోని ఫ్రంట్ గేట్ &బ్యాక్ అద్దాలు మరియు సోఫా, కబోర్డ్స్ తక్కువ ధరకు అమ్మకమునకు కలవు. కావలసినవారు సం:98669 34644, 94906 53625

Ajc-000

ఉద్యోగ అవకాశాలు

కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, అకౌంటెంట్, బ్రాంచ్ మేనేజర్ కావలెను. నెలవారీ జీతం : కంపెనీ ప్రమాణాల ప్రకారం, ఉద్యోగ స్థానం : రాజంపేట, కంపెనీ : SLN మార్కెటింగ్ PVT LTD, పరిశ్రమ రకం : రియల్ ఎస్టేట్ పరిశ్రమ, రాజంపేట మరియు రైల్వే కోడూరు ప్రజలకు మాత్రమే, మీకు ఆసక్తి ఉంటే మీ రెజ్యూమ్‌లను 8121628089కి సంప్రదించండి / షేర్ చేయండి.

Ajc-000

CHANGE OF NAME

I, ASMA ANWAR HUSSAIN SAB & D.O.B: 22/10/2005 (Old name) D/O ANUPURU HUSSAIN SAHEB, residing at D.No.6/147-A, RS Road, Rajampet Town & Mandal, Annamayya District, A.P., hearby changed my Surname as ANUPURU ASMA & D.O.B:22/08/2005 (New name), My father Surname as ANWAR HUSSAIN SAB TO ANUPURU HUSSAIN SAHEB, My Mother Surname as ANWAR AMENA BEE TO ANUPURU AMEENA BEE

AJC-000

యూనిట్ కార్యాలయం

9985411183

9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

సికెదిన్నె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్ తెలిపారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవా ల్లో భాగంగా గురువారం కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు లక్ష్మీప్రసన్న, పోలీసుశాఖ అధికారులు అరుణ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ డేని విజయవంతం చేయాలి

కడప నాగరాజుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కడపలోని నూర్జహాల్ కల్యాణ మండపంలో ఈనెల 27న నిర్వహించనున్న నేషనల్ ఎలక్ట్రీషియన్‌డేని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్, నగర అధ్యక్షుడు చిట్టి, నగర ప్రధాన కార్యదర్శి మైనం మల్లికార్జున మాట్లాడారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, ఆర్‌ఎస్‌యు ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం డీఈఓ కార్యాలయం ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

గోకులాలతో రైతులకు ఎంతో ఉపయోగం

వల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) :గోకులాలతో రైతులకు ఎంతో ఉపయోగమని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప.
S.O.P. No. 03/2025

1) Vyankatesh Timappa Kunchikorve S/o Late Timappa Kunchikorve, aged 48 years, residing at Room No. 193, Maharana Pratap Nagar, Rajiv Gandhi Chawl, Dharwada, Dharavi, Mumbai, Maharashtra - 400017. 2) Nirmala Kunchikorve W/o Late Parshuram Kunchikorve, aged about 52 years, Residing at Room No. 216, GFFL, MC 95/4, Rajiv Gandhi Chawl, 90 Feet Road, MP Nagar, Dharavi, Mumbai, Maharashtra - 400017. **- Petitioners**

V/s

Nil **- Respondent**

పై నంబరులో గల పిటిషనర్‌లు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, డి.నెం. 20/1066, Upstairs, Police Lane, Co-Operative Colony, Kadapa City, Kadapa District, Late నాగ సుబ్బమ్మ కె alias నాగసుబాలు టి.కె. సేవింగ్స్ అకౌంట్‌లోగల నగదును పొందుటకు పై కోర్టు నందు వారి వారసులైన కుమారుడు కె. వెంకటేష్ మరియు కోడలు నిర్మల కె. వారసత్వ ధ్రువీకరణ పత్రం కొరకు పిటిషన్‌ను దాఖలు చేసినారు. ఈ పిటిషన్‌పై ఆక్షేపణలు వున్నయెడల 10-02-2025వ తేదీన ఉదయం 10.30 ని.లకు కోర్టు నందు హాజరై ఆక్షేపణలు తెలుపగలరు లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీమతి టి. పద్మజ, M.Com., LLM
శ్రీ పి. ప్రవీణ్‌కుమార్, B.Com., LLB (Hons)
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు

సుభాష్ చంద్రబోస్ సాహసవీరుడు: తులసిరెడ్డి

వేంపల్లె/పులివెందుల రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశభక్తి పరాయణుడు, సాహస వీరుడు అని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. గురువారం వేంపల్లెలో చంద్రబోస్ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధులలో నేతాజీ అగ్రగణ్యుడన్నారు. అలాగే భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మా ర్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప కొనియాడారు. పాత ఎమ్మెల్యే కార్యాలయంలో నివాళులర్పించారు.

పబ్లిక్ నోటీసు

కడపటౌన్ ముత్తరసపల్లి డోర్ నెం. 40/132-1లో నివసించు లేట్ డి. గంగయ్య గారి భార్య దాసరి ఈశ్వరమ్మ మరియు కుమారులు దాసరి శ్రీనివాసులు, దాసరి దేవేంద్ర ఇచ్చిన సూచనల మేరకు జారీచేయు పబ్లిక్ నోటీసు ఏమనగా, షెడ్యూల్ దాఖలా ఆస్తిపై నా కక్షిదారులకు హక్కు అనుభవముకలదు. నా కక్షిదారులకు గౌరవ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జికోర్ట్, కడపలో, నా కక్షిదారులకు హక్కుతోకూడిన స్వాధీనమున్నదని పెర్మనెంట్ ఇంజక్షన్ కోరుతూ ఎరగంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అలియాస్ D.K.T. శ్రీనివాసులరెడ్డి, ఎరగంరెడ్డి తులసి ఈశ్వరమ్మ మరియు కొత్తమద్ది శ్రీనివాసులులపై, పైకోర్టులో O.S.No. 39/2021 దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా విచారణకుగాను కోర్టులో పెండింగ్ ఉన్నది. ఐతే, సదరు D.K.T.శ్రీనివాసులురెడ్డి 01.01.2025న చనిపోయినందున వారి వారసులు దావా పెండింగ్ విషయం మభ్యపెట్టి సదరు ఆస్తిని అమ్మచూపు తున్నారని నా కక్షిదారులకు తెలియ వచ్చింది. అట్లు అమ్మిన, కొనిన చల్లనేరదని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

<u>షెడ్యూలు :</u> కడప డిస్ట్రిక్ట్, కడప సబ్-డి, కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన చిన్నచౌక్ విలేజీ పొలంలోని సర్వేనెం. 699/1లోని య. 0.63 సెంట్లు, <u>వివరాలు :</u> తూర్పు : దుంపల రామకృష్ణయ్య గారి భూమి, పడమర : ఇతరులకు సంబంధించిన ఇల్లు, ఉత్తరం : ఈ సర్వేనెం.కు సంబంధించిన ఖాళి జాగా, దక్షిణం : రోడ్డు.

ఇట్లు
ఎం. సురేష్‌కుమార్, M.A., B.L., సిగిబాల రాహుల్, M.A., L.L.B. అడ్వకేట్స్, కడప.

ఘనంగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

కమలాపురం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను కమలాపురం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న నారా లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ స్థానిక నాయకులు పుత్తా సాయి నరసింహారెడ్డి, వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, మల్లేశ్, మహేశ్వర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, పల్లెరామసుబ్బారెడ్డి, శంకర్‌యాదవ్, బోగేటి రవి, భాస్కరరెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కడప నగరంలో...

కడప మారుతీనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 42వ జన్మదినం సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో వేడుకలను టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కుంటు పడిన రాష్ట్ర అభివృద్ధిని చక్కదిద్దేందుకు లోకేశ్ చొరవ అద్వితీయమన్నారు.

'అల్‌షిఫా'లో అన్నదానం

టీడీపీ కువైత్ ఎన్‌ఆర్‌ఐ ఉపాధ్యక్షుడు షేక్ రహమతుల్లా ఆధ్వర్యంలో పాతరిమ్స్ వద్దగల అల్‌షిఫా మానసిక విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రంలో అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి కేక్ కట్ చేసి అన్నదానం ప్రారంభించారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, నాయకులు ఇర్ఫాన్, నిజాం, సూరి, సమీర్, నగర 2, 28 డివిజన్‌ల ఇన్‌చార్జ్‌లు ఎం.అంజి, జి.రాఘవ, తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు ఎం. సునీత, నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లోకేశ్, నగర అధ్యక్షుడు అనిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో...

టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో కేక్ కట్‌చేసి, అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గన్నెపాటి మల్లేష్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ సెల్ ప్రధానకార్యదర్శి ఎస్. రవిశంకర్‌రెడ్డి, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల శివరామ్, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, నగర మహిళా అధ్యక్షురాలు సునీత, నగర ఉపాధ్యక్షురాలు ప్రణవతి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద...

టీడీపీ నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, నాయకులు బండి జయశేఖర్, ఏ.రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కేక్ కట్‌చేశారు. అనంతరం అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి. హరిప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాసా కోదండరామ్, నాసర్ అలీ, కరీముల్లా, దస్తగిరి, రామలక్ష్మమ్మ, స్వర్ణలత, చిప్పగిరి మీనాక్షి, విజయలక్ష్మి, కె. స్వర్ణలత, శ్రీదేవి, కె. జనార్థన్‌రెడ్డి, ఆదిల్, ఎ. రమణ తదితరులు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి.. గంగమ్మ కొండపైకి మోకాళ్లపై వెళ్తున్న రవికుమార్

అంబేద్కర్ సర్కిల్ సమీపంలో...

టీడీపీ నగర 13వ డివిజన్ ఇన్‌చార్జి చిట్టిబోయిన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో తన కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. వేంపల్లి సుధాకర్‌రెడ్డి, గంగాధర్ యాదవ్, చక్రికుమార్ యాదవ్ హాజరయ్యారు.

తండ్రికి తగ్గ తనయుడు లోకేశ్

తండ్రికి తగ్గ తనయుడు లోకేశ్ అని టీడీపీ తొగటవీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ అన్నారు. సమితి కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. టీడీపీ యువనాయకులు విష్ణువర్థన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఓ.రవి, ఏ.చంద్ర ఓబుల్‌రెడ్డి, మాసా కోదండరామ్, జయకుమార్, కొండా సుబ్బయ్య, ఎం. మహేష్, మహాదేవరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

లోకేశ్ కృషి అద్వితీయం

కడప రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆశయసాధనకు ఆయన తనయుడు లోకేశ్ అద్వితీయమని టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గడ్డ గుర్రప్ప పేర్కొన్నారు. లీగల్‌సెల్ కార్యాలయంలో కేక్‌ను కట్‌చేశారు. న్యాయవాదులు బి.ఓబులేసు,సురేష్, శ్రీనివాసులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

చక్రాయపేటలో...

రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డులో సానే రాహుల్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచు సుబ్బరామయ్య కేక్ కట్ చేశారు. అనంతరం 40 మంది యువకులు రక్తదానం చేశారు. రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి లోకేశ్‌తోనే సాధ్యమన్నారు. అలాగే నాగులగుట్టపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. రోగులకు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర నాయకుడు కె.రామచంద్రారెడ్డి, తుపాకుల చంద్ర, మెడికల్ స్టోర్ అంజనేయులు, దాసరి రామకృష్ణ, టీడీపీ అమర్, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

చెన్నూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా రామనపల్లె ఉర్దూ పాఠశాలలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దిల్‌షాద్‌బేగం, ఖాదిరయ్య పాల్గొన్నారు.

వేంపల్లెలో...

రామగోపాల్‌రెడ్డి కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ వేంపల్లె పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, మండల మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. దేవస్థాన మాజీ చైర్మన్ జయచంద్రారెడ్డి, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, గిడ్డంగివారిపల్లె గోపాల్‌రెడ్డి, పోతిరెడ్డి శివ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో: స్థానిక టీడీపీ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పసుపులేటి వీరభద్ర, తెలంగాణ వలి, ఎద్దుల రామచంద్ర, మాబుషరీఫ్, భాస్కర్, కరిముల్లా, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో...

జె.కొత్తపల్లె హైస్కూలులో కేక్ కట్ చేసి విద్యార్థులకు చాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి క్రిష్టారెడ్డి, సుబ్బనరసింహులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై గంగమ్మ కొండ మెట్లు ఎక్కిన డైరెక్టర్

వేంపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్ ఆయురారోగ్యాలతో ఉంటూ మరింత ఉన్నతంగా ఎదిగి ప్రజాసేవ చేయాలని ఆకాంక్షిస్తూ వేంపల్లెకు చెందిన గిరిజన కో ఆపరేటివ్ డైరెక్టర్ మేదర రవికుమార్ నంది మండలం కొండగంగమ్మ కొండపైకి మోకాళ్లతో మెట్లు ఎక్కి పూజలు చేశారు.

పులివెందులలో...

టీడీపీ నేతలు లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను రెండు చోట్ల వేర్వేరుగా నిర్వహించారు.వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వద్ద ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణలో బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్‌రవి) ఆదేశాల మేరకు పులివెందుల టీడీపీ కార్యాలయంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్‌మారెడ్డి జోగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవితేజరెడ్డి, పుప్పాల వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, పులివెందుల టీడీపీ పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, నల్లగారి భాస్కరరెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి



అన్నదానం చేస్తున్న టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి



చెన్నూరు: విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మన్సూరు అక్బర్, వెంకటసుబ్బారెడ్డి






అన్నదానం చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి, రహమతుల్లా... అన్నదాన కార్యక్రమంలో టీడీపీ నేతలు అమీర్‌బాబు... కేక్ కట్‌చేస్తున్న మడక చక్రధర్... చక్రాయపేట: రక్తదానం చేస్తున్న దృశ్యం



సమగ్రాభివృద్ధి, సంక్షేమం కోసం లోకేశ్ నిరంతర కృషి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ నారా లోకేశ్ కార్యకర్తల అభివృద్ధికి తోడ్పడతారన్నారు. టీడీపీ 22వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, అనిల్, ఉదయ్, దాస్, యోహాన్, ఓబులేస్, గంగాదర్, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ

'ఉద్యమాలకు సిద్ధం కావాలి'

కడప(వినాయకనగర్), జనవరి23(ఆంధ్రజ్యోతి): యువజన సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు లేక బెంగుళూరు, హైదరాబాదు వంటి నగరాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు.

ప్రతి వ్యక్తికీ కంటి చూపు ప్రదానం

అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు

కడప క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తికీ కంటి చూపు ప్రదానమని ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. గురువారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి ఆదేశాల మేరకు ఏఆర్ మొబిలైజేషన్‌లో భాగంగా పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఎంటి (మోటారు ట్రాన్స్‌పోర్టు) విభాగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భం గా అదనపు ఎస్పీ అడ్మిన్ కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య మాట్లాడుతూ మన జీవితంలో అన్నింటికంటే ముఖ్యమైనవి కళ్లు అని, అందుకే 'సర్వేంద్రియానాం నయనం ప్రదానం' అంటారన్నారు. కళ్లు మనకు దేవుడిచ్చిన అపురూపమైన నిధి అని, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం మన విధి అన్నారు. 90 మంది పోలీసు వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి యూనిట్ హెడ్ వి.సూర్యప్రకాశ్‌కు జిల్లా పోలీసు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ వీరేశ్, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన అధికారులు

సింహాద్రిపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గ్రామ సమీపాన ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కింద జోములెక్కిన భూములను తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పులివెందుల మున్సిపాలిటీకి తాగు నీటిని అందించేందుకు గాను నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్‌ని ఏర్పాటు చేశారు. సమ్మర్ స్టోరేజ్‌లో నీరు నిల్వ ఉండటంతో అక్కడ ఉన్న నక్కలపల్లి, బలపనూరు గ్రామాలకు చెందిన భూముల్లో నిరంతరం తేమ ఉండటంతో అవి చౌడు భూములుగా మారి పంటలు పండటం లేదు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

వీరపునాయునిపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ మెడలో బంగారు చైన్ గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. గురువారం ఉదయం 9 ఉంచి 10గంటల మధ్యలో మహిళ ఇంటి వద్దకు గుర్తు తెలియని వ్యక్తివెళ్లి మీ ఆయన ఉన్నారా అంటూ మాట్లాడుతూ మెడకు వేసుకున్న నాలుగు తులాల చైన్ లాక్కొని స్కూటర్‌లో పారిపోయాడని బబాధితులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.

యూసీఐఎల్ పరిసర ప్రాంత ప్రజలను ఆదుకోండి

● డిప్యూటీ సీఎంను కోరిన బీటెక్ రవి

పులివెందుల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలోని ఎం.తుమ్మలపల్లె గ్రామంలో ఉన్న యురేనియం పరీవాహక గ్రామాల ప్రజలను ఆదుకోవాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కోరారు. గురువారం ఆయన వెలగపూడిలో డిప్యూటీ సీఎంను కలిసి ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 2012 నుంచి యురేనియం వారు ఉత్ప త్తులు చేస్తున్నారన్నారు. ముడి ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను టైలింగ్‌పాండ్‌లో నింపుతున్నారన్నారు. పాండ్ నిర్మాణ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కింది భాగాన బెంటోనైట్ క్లే 50ఎంఎం తిక్‌నెస్‌లో వేయాల్సి ఉండగా క్లే వేయకుండా నిర్మాణాన్ని పూర్తిచేశారన్నారు. దీంతో వ్యర్థాలు భూమిలో ఇంకిపోయి తాగునీరు, వ్యవసాయ బోర్లు కలుషితమవుతు న్నాయన్నారు. కొట్టాల, కనంపల్లె ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారన్నారు. యురేనియం కంటెంట్ 60పీపీబీ మించకుండా ఉండాల్సి ఉంటే ఈ మూడు గ్రామాలలో 400పీపీబీ కంటే ఎక్కువగా ఉందని రుజువైందన్నారు.మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె, కెకె కట్టాల, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె, కనంపల్లెల్లో కలుషిత నీరు, రేడియేషన్, కాలుష్యం వలన మహిళలకు గర్భస్రావాలు, క్యాన్సర్ వంటి జబ్బులు, చర్మ వ్యాధులు వస్తున్నాయన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న బీటెక్ రవి

అలాగే గతంలో కలుషితమై బోర్ల వలన పంట నష్టపోయిన మబ్బుచింతలపల్లె, కొట్టాల గ్రామ రైతులకు యూసీఐఎల్ 78ఎకరాలు పరిహారం ఇచ్చిందన్నారు. ఇపుడు ఆ భూములతో పాటు కొట్టాల గ్రామాన్ని కూడా యూసీఐఎల్ వారు తీసుకొని పరిహారం, ఉద్యోగం, పునరావాసం కల్పించాలని కోరారు. రాచకుంటపల్లెలో 280 ఎకరాలకు వెంటనే పరిహారం, ఉద్యోగం ఇప్పించాలని ఈ సందర్భంగా కోరారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ

● ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ రూపొందించాలని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో కమిషనర్ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ కడప నగరంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బుగ్గవంక సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పారిశుధ్యానికి సబంధించి ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు జరగాలన్నారు. అవసరమైతే ప్రభుత్వంతో మాట్లాడి వాహనాలను ఏర్పాటుచేస్తామన్నారు. పన్నుల వసూల్లో ఎటువంటి అలసత్వం లేకుండా కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించి పన్నులు వసూలు చేయాలన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ మనోజ్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
A.C.M.: 99854 11184

రోడ్డు భద్రత పాటిస్తే సురక్షితం

36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రవాణా, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులు





జమ్మలమడుగు పాత బస్టాండులో మానవ హారం చేస్తున్న పోలీసులు, విద్యార్థులు - పంచాయతీరాజ్ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ

జమ్మలమడుగు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రత పాటిస్తే సురక్షిత ప్రయాణాలు జరుగుతాయని రవాణా, పోలీసులు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సూచించారు. 36వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీసులు, విద్యార్థులు, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జమ్మలమడుగులో నిర్వహించిన ర్యాలీలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది, సాయిపరమేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు తదితర వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. గాంధీ విగ్రహం వద్ద పోలీసులు, విద్యార్థులు మానవహారం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణం నుంచి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు ర్యాలీ చేశారు. పంచాయతీరాజ్ ఈఈ శ్యాంసుందర్‌రాజు, డీఈఈ సింగంరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.


రహదారి నియమాలను పాటించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి రహదారి నియమాలను పాటించాలని ఆర్డీఓ మురళీధర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం మిన్న అని, వాహనాన్ని నడిపేటప్పుడు సంయమనం పాటించాలని సూచించారు. భద్రత కోసం హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో కలిగే నష్టాల గురించి వివరించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవీంద్రనాయక్, హేమకుమార్, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, పృధ్వీనారాయణ, శారదా భవానీ, దావీదు, మౌనయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బద్వేలు కూడలిలో....

బద్వేలు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై ప్రతి వాహన దారుడూ అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ శేఖర్‌రావు అన్నారు. నాలుగు రోడ్ల కూలిలో పలువురితో ర్యాలీ నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటపుడు తప్పక హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణంలో సీటు బెల్టు ధరించాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు ఏ వాహనాన్ని కూడా నడపరాదన్నారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డ్రైవింగ్ పాఠశాల, షోరూమ్ ఓనర్స్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లింగమయ్యస్వామి తిరునాళ్లు



పూజలందుకుంటున్న లింగమయ్యస్వామి

కొండాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లెలో లింగమయ్యస్వామి తిరునాళ్లు గురువారం వైభవంగా జరిగాయి. లింగమయ్య స్వామికి, గ్రామదేవతలు పెద్దమ్మ, అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కొందరు లింగమయ్యస్వామి, పెద్దమ్మకు జంతుబలులు సమర్పించారు. ఏటా పుష్యమాసం చివరి గురువారం జరిగే లింగమయ్య స్వామి తిరునాళ్లకు చుట్టు పక్కల ప్రాంతీయులే కాక పొరుగు జిల్లాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి లింగమయ్యస్వామి, పెద్దమ్మ అంకాలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ రఘునాథరెడ్డి మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణ రెడ్డి, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు. రంగులరాట్నాలు, పెద్దఎత్తున చెరుకుల బండ్లు లింగమయ్య స్వామి తిరునాళ్లలో ఆకర్షణగా నిలిచాయి. కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, కొండాపురం, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐలు విద్యాసాగర్, హృషికేశ్వర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ముద్దనూరులో....



చౌటిపల్లె వద్ద లింగమయ్యస్వామి

ముద్దనూరు జనవరి23(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొత్తచౌటిపల్లె (ఆర్అండ్ఆర్ సెంటర్)లో గురువారం లింగమయ్యస్వామి తిరునాళ్లు నిర్వహించారు. లింగమయ్యస్వామి ప్రత్యేక అలంకరణ చేశారు. మండలంలో ముంపునకు గురైన పాత చౌటిపల్లెలో వెలసిన పురాతన లింగమయ్యస్వామి విగ్రహాన్ని కొత్త చౌటిపల్లెలో పునఃప్రతిష్ఠ చేయడంతో భారీ ఎత్తున జిల్లా నలుమూలల నుంచి లింగమయ్యస్వామి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

అనాథాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల విరాళం



ఆశ్రమానికి నిత్యావసర సరుకులు విరాళంగా ఇస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఎర్రగుంట్ల, జనవరి 23 (ఆంధ్యజ్యోతి): కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం గురువారం తిప్పలూరులోని ఎద్దుల పెద్దశేషమ్మ అనాథాశ్రమానికి నిత్యావసర సరుకులను విరాళంగా ఇచ్చారు. సుమారు రూ.31వేల విలువైన వస్తువులను సంఘం అధ్యక్షుడు కే.రమేష్, కార్యదర్శి జి.నాగశేషారెడ్డి అధ్వర్యంలో పంపిణీ చేశారు. అనాధలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషకంగా ఉందన్నారు. కోశాధికారి ఎన్.నరసింహులు, ప్రొద్దుటూరు డిస్కం డీఈ కేవీ.రమణారెడ్డి, ఏడీఈ కిరణ్, ఏఈఈ వి.ప్రియదర్శినిరెడ్డి, సంఘం నేతలు బర్నబాసు, ఎంవీ చలపతి, పరశురాం, ఎన్ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎస్.బాలకొండయ్య, సి.గంగాధర్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ సాధికారత సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చిత్ర

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ సాధికారత సాధించాలని అనంతపురం జేఎన్‌టీయూ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ డాక్టర్ వి.బి.చిత్ర పేర్కొన్నారు. వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో 'మేలుకో నేటి ఆధునిక మహిళ'లో ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక మహిళలు మానసికంగా శారీరకంగా దృఢంగా లేరన్నారు. తీసుకునే ఆహారం పట్ల అవగాహన లేకపోవడం, సాధారణ ప్రసవం తగ్గి సిజేరియన్లు ఎక్కువ అవడం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, చట్టాలపై అవగాహన లేకపోవడం, తదితర కారణాలతో విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని వివరించారు. ఐసీడీఎస్, సీడీపీఓ అరుణకుమా రి మాట్లాడుతూ మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మహిళల భద్రత రక్షణ సామాజిక అంశాలను బలోపేతం చేయడానికి 'మిషన్ శక్తి' పథకం అమలు చేస్తోందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు, అధ్యాపకురాలు భగీరధీ, హెచ్ఓడీ, ఐఐసీ ప్రెసిడెంట్ ఎం.వి.వి. ప్రసాద్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరళంగా బోధించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంఘిక శాస్త్రం సరళమైన విధానంలో బోధించాలని ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈఓ మీనాక్షి సూచించారు. నేతాజీ సుబాష్‌చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు పీఎన్ఆర్ ఫంక్షన్ హాలులో సాంఘిక శాస్త్ర పరీక్షలు నిర్వహించారు. గంగజశ్వంత్‌రెడ్డి (జడ్పీ హైస్కూలు, రామిరెడ్డిపల్లె), కె.సన (జడ్పీ గర్ల్స్ హైస్కూలు, ఎర్రగుంట్ల) ప్రథమ బహుమతి రూ.3 వేలు, సంజనరెడ్డి (జడ్పీ హైస్కూలు, మాచనపల్లి) ద్వితీయ బహుమతి రూ.2 వేలు, సాత్విక్‌రెడ్డి, హాసికా (జడ్పీహైస్కూలు, హిమకుంట్ల) తృతీయ బహుమతి రూ.1000, మరో 15 మంది విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ అధ్యక్షుడు గురుకుమార్, ప్రధాన కార్యదర్శి షాబుద్దీన్, కన్వీనర్ బాస్కర్‌రావు, హెచ్ఎంలు పద్మనాభరాజు, నరసింహులు, సుబ్రహ్మణ్యం, బాబాసాహెబ్, గౌరీలత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

బ్రహ్మంగారిమఠం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ ఏడీ వెంకటసుబ్బయ్య, డాక్టర్ శిరీష తెలి పారు. గురువారం మల్లేపల్లె పంచాయతీ చెంచయ్యగారి పల్లెలో పశువైద్య శిబిరాన్ని చేపట్టారు. దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందును తాపించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, టీడీపీ నేతలు చిలమల నాగయ్య, మేకల సుధాకర్, సుబ్రహ్మణ్యం, మస్తాన్, వీరయ్య గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

లోకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి : టీడీపీ



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తదితరులు

జమ్మలమడుగు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జరిగాయి. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ కార్యాలయం వద్ద పుట్టిన రోజు సంబరాలు చేసుకున్నారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ నారా లోకేశ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఐటీ శాఖను బలోపేతం చేసి దేశవ్యాప్తంగా అంతర్జాతీయ స్థాయిలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. టీడీపీ నేతలు రమణారెడ్డి, వంగల నాగేంద్రయాదవ్, జమాల్, పొన్నతోట శ్రీనివాసులు, బిర్రు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లు, ఒత్తిడికి దూరంగా ఉండండి



సూచనలు ఇస్తున్న మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కవితాప్రసన్న

దువ్వూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లు, ఒత్తిడికి యువత దూరంగా ఉండాలని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రి మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టరు కవితాప్రసన్న సూచించారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 'మానసిక ఆరోగ్య సంరక్షణ'లో ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికీ ఒత్తిడులకు గురికావద్దని తెలిపారు. అటువంటి వారు ఎవరైనా ఉంటే సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే కౌన్సెలింగ్ ఇచ్చి ఉచితంగా మందులు ఇస్తామని చెప్పారు. స్థానిక వైద్యులు సురేష్‌బాబు హేమలత, రోషిణి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త బయట వేస్తే చర్యలు తప్పవు



చికెన్‌షాపుల వద్ద పరిశీలిస్తున్న కమిషనర్

బద్వేలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఆయాషాపుల యజమానులు చెత్త బయట వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హెచ్చరించారు. గురువారం చికెన్‌షాపుల వద్ద వ్యర్థాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తునపుడు దుర్వాసన వస్తోందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. రోజు సాయంత్రం చెత్త వాహనాలు వస్తున్నా కొందరు రోడ్డుపైనే చెత్తవేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

'విమర్శించేందుకు వైసీపీ నేతలు సిగ్గుపడాలి'

బద్వేలుటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాల ఆరోపణలతో మున్సిపల్ వైసీపీ వైస్ ఛైర్మన్ గోపాలస్వామి అరెస్ట్ అక్రమ కేసు అనడానికి వైసీపీ నేతలు సిగ్గుపడాలని కూటమి నేత బొజ్జా రోశన్న, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి అన్నారు. వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ పేదల పక్షాన పోరాటాలు చేసి జైలుకు వెళ్లలేదని, నిరుపేదల భూములను కాజేసి, చనిపోయిన వారిని బతికున్నారని చూపి, దళితుల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అడ్డంగా దొరికి జైలుకు వెళ్లాడన్నారు. వైసీపీ నేతల అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడుతుంటే జీర్ణించుకోలేక, ఇటువంటి ఆరోపణలు చేస్తూ పబ్బంగడుపుతున్నారని విమర్శించారు. మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, బిగ్‌బాస్, సుబ్బరాయుడు యాదవ్, న్యాయవాది ప్రసాద్, సింగసాని విజయ్‌కుమార్, రమణాయాదవ్ పాల్గొన్నారు.

'రాజకీయాల్లో మార్పులకు నాంది లోకేశ్'



కడపలో శ్రీనివాసరెడ్డికి కేక్ తినిపిస్తున్న చెరుకూరి రవికుమార్

పోరుమామిళ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌కు నియోజక వర్గ యువనేత చెరుకూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి సమక్షంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చెరుకూరి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో మార్పులకు నాంది పలికిన యువ కెరటం నారాలోకేశ్ అన్నారు.

యువగళంతో ప్రజలతో మమేకమైన లోకేశ్



భారీ కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 23(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రతో మంత్రి లోకేష్ రాష్ట్ర ప్రజలతో మమేకమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవ రెడ్డి కొనియాడారు. లోకేశ్ జన్మదినం సందర్భంగా స్థానిక కార్యాలయం వద్ద నేతలు, కార్యకర్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపాల్ ఛైర్మన్లు ఆసం రఘురామిరెడ్డి, ముక్తియార్, పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, రాజుపాలెం మండల మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, యువనేత బచ్చల వీరప్రతాప్, కౌన్సిలర్లు మురళి, మహమ్మద్ గౌస్, కమాల్ బాష, జంబాపురం రామాంజనేయులు, నాగేంద్ర, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, నేతలు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రకటన కరపత్రాల పంపిణీ



కరపత్రాలను అందజేస్తున్న విజయజ్యోతి

బద్వేలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు జైబాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కళాలల్లో రాజ్యాంగ ప్రకటన కరపత్రాల పంపిణీ చేపట్టారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ విజయజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రతి పౌరునికీ రాజ్యాంగం స్ఫూర్తి తెలిపేలా కరపత్రాల పంపిణీ నిర్వహించామన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణ మాజీ అధ్యక్షుడు అచ్యుతరాజు, కాంగ్రెస్ నేతలు నరసింహయాదవ్, గుర్రప్ప, సుధాకర్‌రెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా - ఇద్దరికి గాయాలు

ముద్దనూరు జనవరి23(ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి హైవేపై కొత్త చౌటిపల్లె వద్ద గురువారం మధ్యాహ్నం కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు... అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వారు రాయచోటిలో చదువుతున్న బంధువుల అబ్బాయిని హాస్టల్‌లో విడిచి వస్తున్నారు. చౌటిపల్లె దాటగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న వేణుమాధవ్, రవితేజకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో ముద్దనూరులోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

బద్వేలు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీఓ చంద్రమౌళి ఆదేశించారు. గురువారం రామాంజనేయనగర్, వెంకటాద్రి నగర్ ఎస్టీకాలనీలను ఆర్డీఓ సందర్శించారు. ఎంపీడీఓ మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆలస్య జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఎస్టీకాలనీల్లో సదుపాయాలు, పథకాల లబ్ధికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభాస్కర రాజు, అన్నిశాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత విలువలు


బద్వేలు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యతో ఉన్నత విలువలు సాధించవచ్చని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు రామాంజనేయ నగర్ ఎస్టీకాలనీలో గురువారం ప్రత్యామ్నాయ పాఠశాలను పారంభించిన ఆమె మాట్లాడుతూ కాలనీలోని చిన్నపిల్లలు, వెంకటాద్రి నగర్ పాఠశాలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను తమ దృష్టికితీసుకురాగా ప్రత్యామ్నాయ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం పిల్లలు చదువుకోవాలని, తరువాత పూర్తి స్థాయిలో పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

పొన్నతోటలో ఘర్షణ నలుగురికి గాయాలు

జమ్మలమడుగు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని నాగలక్షుమ్మ ఇంటిపై రోశమ్మ కుమారుడు శివక్రిష్ణ, అతని భార్య సుకన్య దాడి చేశారు. పోతనబోయిన నాగలక్షుమ్మ ఇంట్లో వేపచెట్టు ఉంది. ఆ వేపచెట్టుపై ఇంటి పక్కనే ఉన్న రోశమ్మ కోళ్లు చేరి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని నాగలక్షుమ్మ రోశమ్మకు చెప్పింది. దీంతో పాతకక్షలతో దాన్ని దృష్టిలోఉంచుకుని రోశమ్మ కుమారుడు శివక్రిష్ణ, అతని భార్య సుకన్య రాళ్లు, కర్రలతో నాగలక్షుమ్మ ఇంటిపై దాడి చేశారు. ఇందులో నాగలక్షుమ్మ, భర్త నారాయణ, కోడలు గంగాదేవి, కుమారుడు నారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రామక్రిష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నేతాజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

పోరుమామిళ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేతాజీ సుబాష్‌చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ చరిత్ర సువర్ణ అధ్యాయమని వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అన్నారు. గురువారం పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమాలు, ఉద్యమ ప్రస్తావన, దేశభక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివారెడ్డి, వీరయ్య, వెంకట్రావు, పర్వీన్, గురమ్మ, సబిత పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ కార్యాలయంలో....

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేతాజీ సుబాష్‌చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు డేవిడ్, పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పేర్కొన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బోస్ ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటీష్ పాలకులను గడగడలాడించారన్నారు. మీ రక్తం నాకివ్వండి, మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తానని యువతను ఉత్తేజపరిచారని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో....

జమ్మలమడుగు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ కళాశాల వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తన సైన్యంతో గడగడలాడించిన ధీరుడు సుబాష్ చంద్రబోస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జననం తప్ప మరణంలేని యోధుడు సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని కడప ఉక్కుకోసం యువత పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శి మహేష్‌యాదవ్, సురేంద్ర, రమేష్, సూరి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 | జమ్మలమడుగు - S.R.: 94404 72816 | మైదుకూరు - S.R.: 91334 42886 | బద్వేల్ - S.R.: 99666 83437 | A.C.M. : 99854 11184